## క్లుప్తంగా

### నేటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ బుద్వేల్ టీచర్స్ కాలనీలోని కట్ట మైసమ్మ ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. 15వ తేదీన స్వర్ణ కవచలాంచకృత (దుర్గాదేవి), 16న శ్రీ బాల త్రిపుర సుందరి దేవి, 17న శ్రీ గాయత్రిదేవి, 18న శ్రీ అన్నపూర్ణ దేవి, 19న శ్రీ లలితా త్రిపురా సుందరీదేవి, 20న శ్రీ మహాలక్ష్మీ దేవి, 21న శ్రీ సరస్వతీ దేవి (మూల నక్షత్రం), 22న దుర్గాదేవి (దుర్గాష్టమి), 23న మహిషాసుర మర్దని, 24న దశమి సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. పూజల్లో పాల్గొనదలచిన భక్తులు 9866065496, 7013825431 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### సరుకులు పంపిణీ



**శంషాబాద్:** నిరుపేదలకు త్రినేత్ర ఫౌండేషన్ ద్వారా దసరా కానుకలు అందజేశారు. శనివారం ఆర్బీనగర్, ఆదర్శనగర్, హుడా కాలనీల్లో గుడిసెల్లో నివాసముంటున్న పేదలకు ఫౌండేషన్ చైర్మన్ మడపతి పరమేశ్వరి చీరలు, సరుకులను అందజేశారు.

### ఆర్‌ఓ సమీక్ష సమావేశం

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మల్లయ్య శనివారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులు, విధులపై చర్చించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ... ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు.

### ఆత్మహత్యలొద్దు.. కొట్లాడి సాధించుకోవాలి

**చార్మినార్:** కొట్లాడి సాధించుకోవాలి తప్పా.. ఆత్మహత్యలు చేసుకోవద్దని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. విద్యార్థులకు సరైన జీవనోపాధి కల్పించకుండా సకాలంలో ప్రభుత్వ నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని ఆయన విద్యార్థులకు హితవు పలికారు. ఆత్మహత్యకు గురైన ప్రవళిక సంతాప సభలో ఆయన మాట్లాడుతూ.. ఎంతో బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు తమ విలువైన ప్రాణాలను బలివ్వద్దొన్నారు. ప్రవళిక కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### కనువిందు.. నృత్య ప్రదర్శన



**మాదాపూర్:** శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా శారీ మేళాకు శనివారం సెలవురోజు కావడంతో నగరవాసులు పోటెత్తారు. బెంగాలీ కాటన్, పెయింటింగ్ చీరలు, గద్వాల్, చందేరీ, ఉప్పాడ పట్టు, నారాయణపేట, గొల్లభామ చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. శిల్పారామం ఆవరణలో సిబ్బంది బతుకమ్మ పాటలతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మైథిలి అనూప్ బృందంచే మోహినియట్టం ప్రదర్శించారు. ఇందులో దేవిస్తుతి, కీర్తనం, చోలకేత్తు, జయదేవకి కిశోర అంశాలను ప్రదర్శించారు. కూచిపూడి నృత్యప్రదర్శనలో భాగంగా ప్రొఫెసర్ భాగవతుల సేతురాం శిష్యబృందం ఓంకారకారిని, శృంగారలహరి తదితర అంశాలను ప్రదర్శించారు.

### అలరించిన మోడల్స్ ర్యాంప్‌వాక్



**మాదాపూర్:** మోడల్స్ ర్యాంప్‌పై క్యాట్‌వాక్ చేసి అలరించారు. మాదాపూర్‌లోని లెమన్ ట్రీ హోటల్‌లో శనివారం విండో ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్వహిస్తున్న మిస్ అండ్ మిసెస్ గోల్డెన్ ఫేస్ ఆఫ్ సౌత్ ఇండియా-2023 కాంటెస్ట్‌ను నిర్వహించారు. యాసిడ్ దాడి బాధిత మహిళలకు చర్మదానంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమం అని వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ గోపినా రవి, శరవణన్ తెలిపారు. చెన్నై, బెంగుళూరు, కొచ్చికి సంబంధించిన ఆడిషన్స్ పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సినీనటులు పాల్గొన్నారు.



అలకాపూర్ ఎంజీ పార్కులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఎస్వీపార్కులో బతుకమ్మలకు పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించిన నిర్వాహకులు

# బతుకమ్మ సంబరాలు

**మణికొండ:** బతుకమ్మ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ప్రతి గ్రామంలో శనివారం మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. రంగు,రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు ఆడి, పాడారు. అనంతరం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద పార్కులకు చేరుకుని అక్కడ సామూహికంగా పెద్ద ఎత్తున బతుకమ్మ ఆడారు. ఉత్సవాలను స్థానిక కౌన్సిలర్‌లు ఎ. నవీన్‌కుమార్, శ్రీకాంత్‌స్వామి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు నిర్వాహకులు పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు.



ఎస్వీపార్కులో..

**సద్దుల బతుకమ్మ..**

**రాజేంద్రనగర్:** సద్దుల బతుకమ్మను శనివారం రాత్రి మహిళలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఇంటి ముందు గౌరమ్మతో బతుకమ్మను ఏర్పాటు చేసి ఆడి పాడి నిమజ్జనం చేశారు. రాజేంద్రనగర్ బతుకమ్మ ఘాట్‌తో పాటు స్థానికంగా ఉన్న చెరువుల్లో కాలువల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



బతుకమ్మలతో వస్తున్న మహిళలు



నార్సింగి శారదా విద్యానికేతన్‌లో .. వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు







ఎంజీ పార్కులో బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించిన కౌన్సిలర్‌లు నవీన్, శ్రీకాంత్‌లు

## శరన్నవరాత్రి.. ప్రత్యేక పూజలు.. అన్నదానం



ధర్మగిరి దేవాలయం



అమ్మవారు

**శంషాబాద్:** పట్టణంలోని ధర్మగిరి దేవాలయంలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ ట్రస్టీ శివదత్త సాయి తెలిపారు. రోజు కుంకుమార్చన, ప్రత్యేకాలంకరణ, లలితాసహస్రనామ స్తోత్ర పఠనం, సరస్వతి పూజ, మహా చండీ యాగం కార్యక్రమాలుంటాయన్నారు. ప్రతి రోజు భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఊట్‌పల్లి శృంగేరీ మఠంలో అమ్మవారి హరిద్ర దర్శనం జరిగింది. ఆదివారం నుంచి తొమ్మిదిరోజుల పాటు శారదా శరన్నవరాత్రుల్లో సప్తశతి పారాయణం, సాముహిక కుంకుమార్చన, గోపూజ, గురువందనం, ప్రాతఃకాల అర్చన ,మహామంత్ర పుష్పం, తీర్థప్రసాద కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు సోమయాజుల శ్రీనివాస్ శర్మ తెలిపారు.

## పరీక్షలను పకడ్బందీగా నిర్వహించలేని ప్రభుత్వం

**అఖిలపక్షం ధర్నా**

**శంషాబాద్:** సర్కారు చేతగానితనంతోనే నిరుద్యోగులు, యువత బలవుతున్నారని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ అన్నారు. కాంగ్రెస్, జనసమితి, సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలంటూ జాతీయరహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. గ్రూప్-2 రద్దు కారణంగా యువత మనోధైర్యాన్ని కోల్పోతున్నారని పరీక్షలను పకడ్బందీగా నిర్వహించలేని ప్రభుత్వం యువత ఉసురుతీస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ తగిన మూల్యం చెల్లించకతప్పదన్నారు. పరీక్షలను నిర్వహించలేని సర్కారు సాగనంపాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ అన్నారు. కార్యక్రమంలో కోటేశ్వర్‌గౌడ్, అక్రమ్‌ఖాన్, జహంగీర్‌పాషా, ఆనంద్, శ్రీధర్, శేఖర్; శ్రీధర్; బీమ్‌రావు భాస్కర్‌రెడ్డి, కృష్ణ, పటేల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయరహదారిపై కాంగ్రెస్ నేతల ర్యాలీ



పీరం చెరువు వద్ద కనిపించిన దృశ్యం

**బండ్లగూడ:** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు ప్రాంతంలో శనివారం ఉదయం అందమైన దృశ్యం ఆవిష్కృతమైంది. సూర్యుడిని క్రేన్ పట్టుకున్నట్టుగా ఉన్న దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది.

### అక్రమ నిర్మాణం.. కేసు నమోదు

**శంషాబాద్ రూరల్:** ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాకుండా నిర్మాణం కూల్చివేతను అడ్డుకున్న వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దషాపూర్ రెవెన్యూలోని సర్వే నంబరు 220/29/ పెద్దషాపూర్‌తండావాసి సబావత్ రాంసింగ్‌కు 30 గుంటల భూమిని అసైన్డ్ చేసింది. ఈ భూమిని అతను వేరే వ్యక్తులకు అమ్ముకోవడంతో పీఓటీ చట్టం ప్రకారం.. ఈ భూమిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. అయితే రాంసింగ్ కుటుంబ సభ్యులు ఇందులో నిర్మాణం చేపట్టడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆర్.సారిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. శనివారం అక్రమ నిర్మాణం కూల్చేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం పోలీసులను రక్షణ కోరగా.. నిర్మాణం అడ్డుకున్న 8 మందిని పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### యువత సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

**గోల్కొండ:** యువకులు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. సమితి కార్యవర్గ సమావేశం శనివారం గోల్కొండ రిసాలబజార్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సేవా సమితి తరపున సంవత్సరం పొడవున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వీటిలో స్థానిక యువత కూడా పాల్గొనేలా చేస్తామన్నారు. నిరుపేదలు, వృద్ధులు, ప్రతిభ గల విద్యార్థుల కోసం కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించామని ఆయన అన్నారు. వృద్ధులకు నిత్యవసరాలను పంపిణీ చేస్తామని, అదే విధంగా మహిళల స్వయం ఉపాధి కోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బొమ్మల సాయిబాబాచారి, రాహుల్‌చారి, శివ, లడ్డూ, సంతోష్, జగదీష్, సురేష్‌చారి ఉన్నారు.

### నూతన కార్యవర్గం

**గోల్కొండ:** కార్వాన్ ధార్మిక ఉత్సవ సమితి నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. కార్వాన్‌లో సమితి సలహాదారులు మధన్‌జాదవ్, ప్రేమ్‌కుమార్‌యాదవ్ తదితరుల పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాతి మురళీకృష్ణగౌడ్, ఉపాధ్యక్షుడిగా కె.సంజయ్‌సింగ్, ఏ.మహేష్‌కుమార్ ముదిరాజ్, ఠాకూర్ శైలేందర్‌సింగ్, అంతారం రాజు, ప్రధాన కార్యదర్శిగా ఏ.గోవర్ధన్, కోశాధికారిగా ఈశ్వర్‌జాంద్ర, కార్యనిర్వహక కార్యదర్శిగా కె.కృష్ణసాగర్, రాచకొండ శ్రీకాంత్‌సాగర్, ఎస్.రమేష్, కార్యదర్శులుగా పడాల అనంతకృష్ణ, జవహర్, సాయినాథ్, ఎం.శంకర్‌పద్మశాలి, పంబి వేణునాయి, రాచకొండ రక్షిత్‌సాగర్‌ను ఎన్నుకున్నారు.

### రాజేంద్రనగర్ టికెట్ ఇవ్వాలని వినతి



బండి సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న మల్లారెడ్డి

**అత్తాపూర్:** రాజేంద్రనగర్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా తనకు టికెట్ కేటాయించాలని కోరుతూ చేవేళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి శనివారం నాంపల్లిలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సారి పార్టీ సీనియర్ నాయకులకు ప్రాధాన్యత ఉంటుందని ఈ నెల 16 లేదా 17వ తేదీల్లో పేర్లు ప్రకటించే అవకాశముందని తెలిపారన్నారు.

జంగ్ 2023 తెలంగాణ

### ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

**బండ్లగూడ:** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి దుర్గాఖలీజ్‌ఖాన్‌లోని మసీదులో శనివారం న్యాజ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరై ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా అందరం కలిసి మెలిసి ఉండాలన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ అస్లాంబిన్ అబ్దుల్లా, యూత్ ప్రెసిడెంట్ మల్లేష్‌యాదవ్, ముస్లింలు పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

## నాసా స్పేస్ యాప్స్ ఛాలెంజ్ పోటీకి జీఎన్ఐటీఎస్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

**గోల్కొండ:** నాసా నిర్వహించే ఇంటర్నేషనల్ స్పేస్ యాప్స్ ఛాలెంజ్ పోటీకి షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఛండీగర్ యూనివర్సిటీ నిర్వహించిన ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఎంపికకావడం తమ విద్యా సంస్థకే గౌరవకారణమని జీఎస్ఐటీఎస్ చైర్మన్ కె.రాఘవరెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో ఎంపికైన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్పేస్ యాప్, సుమన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎందరో ప్రతిభావంతులైన విద్యార్థులు పాల్గొన్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ వైస్ చైర్‌పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి, ప్రిన్సిపాల్ కె.రమేష్‌రెడ్డి, కో ఆర్డినేటర్లు డాక్టర్ ఎస్.రాంచరణ్, విజయ్‌కుమార్, మమత తదితరులున్నారు.

## జాతీయ సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్

**చార్మినార్:** ఉమెన్ రిజర్వేషన్ బిల్లు-2023పై జాతీయ స్థాయి సెమినార్‌ను వచ్చే నెల 9,10 తేదీలలో నిర్వహించనున్నామని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్ తెలిపారు. సిటీ కాలేజీలో ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను సెమినార్ కన్వీనర్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఈ.పావనితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ సెమినార్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా కొనసాగుతుందన్నారు. ప్రొఫెసర్ జయ శంకర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకానామిక్స్ ఆధ్వర్యంలో ఈ సెమినార్ జరుగనుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

## 'నిరుద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసింది'

**అబిడ్స్:** రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రవళిక అశోక్‌నగర్‌లో ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. నిరుద్యోగులు ఎవ్వరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ లోనే అధికారంలోకి వస్తుందని రాహుల్‌గాంధీ చెప్పిన విధానం ప్రకారం..2 లక్షల ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అందిస్తుందన్నారు. ప్రవళిక ఆత్మహత్య చేసుకోవడానికి ప్రభుత్వమే కారణమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### కత్తితో దాడి.. గాయపడ్డ యువకుడు




దాడిలో తీవ్రంగా గాయపడిన షాబాజ్

**అత్తాపూర్:** తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాలు తీసుకోవద్దని చెప్పిన కారణంగా ఓ యువకుడిపై కత్తితో దాడి చేసి పారిపోయిన సంఘటన శనివారం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై కుప్పలింగం తెలిపిన వివరాల ప్రకారం... అత్తాపూర్ హసన్‌నగర్ ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ షాబాజ్ ,ఎమ్మెల్సీ రహమత్ బేగ్ వద్ద డ్రైవర్.శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో దర్బేజ్ అనే వ్యక్తి గంజాయి సిగరెట్ తాగుతూ స్నేహితులతో కలిసి ఇంటి సమీపంలో తిరుగుతున్నాడు. ఇది గమనించిన షాబాజ్ తండ్రి నాజర్ తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో గంజాయి తీసుకోవద్దని చెప్పాడు. దీంతో దర్బేజ్, అతని అనుచరులు ఒక్కసారిగా జేబులో ఉన్న కత్తితో దాడి చేసి పారిపోయారు. ఈ సంఘటనలో షాబాజ్ చెంప కింద భాగంలో తీవ్ర గాయమైంది. స్థానికంగా ఉన్న జోయా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స జరిపించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్రమత్తమైన పోలీసులు దర్బేజ్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

### హిందూ సేవా సమాజ్ చైర్మన్‌గా రాజువస్తాద్

**గోల్కొండ:** ఈసారి దసరా ఉత్సవాలను భారీగా నిర్వహిస్తామని హిందూ సేవా సమాజ్ చైర్మన్‌గా ఎన్నికైన ఎస్.రాజువస్తాద్ అన్నారు. హిందూ సేవా సమాజ్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా ఎస్.రాజువస్తాద్, అధ్యక్షుడిగా సర్దార్ సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా నాగేశ్వర్‌రావు, పి.నరేష్‌సింగ్, పాపాలాల్‌సింగ్, పి.రాజు, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్‌చారి, టి.నర్సింగ్‌రావు, ఎం.హరి, రాజ్‌పాల్‌సింగ్, సునీల్ అమర్‌చంద్, ప్రధాన కార్యదర్శులుగా శోభరాణి పాండే, కృష్ణారావు, కోశాధికారిగా బాలాప్రసాద్‌తివారీ, న్యాయ సలహాదారులుగా ఐ.రమేష్, టికుల మహేశ్వర్‌రావు, శశికాంత్‌తివారీ ఎన్నికయ్యారు.

## సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు మల్లేష్

**మైలార్‌దేవ్‌పల్లి:** భవన నిర్మాణ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు నష్టాల నుండి బయటపడాలని మైలార్‌దేవ్‌పల్లి సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు ఏ మల్లేష్ పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడలో కాంట్రాక్టర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ.. గత 4 సంవత్సరాలుగా సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు భవన యాజమానులు సరైన ధరలు ఇవ్వలేకపోవడంతో నష్టాలు వచ్చి కాంట్రాక్టర్లు అప్పులపాలవుతున్నారన్నారు. ధరలు పెంచడానికి ప్రతి కాంట్రాక్టర్ యూనియన్ నిబంధనలు ఉల్లంఘించకుండా ఉండాలన్నారు.అలాగే ప్రతి అమవాస్య నాడు సెంట్రింగ్ పనులు నిలిపివేయాలని కాంట్రాక్టర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శంకరయ్య, అశోక్ ,ఎస్ బాల్‌రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### చెట్లకొమ్మల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

**బండ్లగూడ:** చెట్ల కొమ్మలను నరికి రోడ్డుపైనే వదిలేస్తున్నారు అనే కథనానికి అధికారులు స్పందించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై చెట్లకొమ్మలను కార్పొరేషన్ అధికారులు తొలగింపచేశారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా వస్తున్నాయని ఈ చెట్ల కొమ్మలను తొలగించడం జరిగిందని ఎప్పటికప్పుడు వాహనాలను రప్పించి తొలగిస్తామని వెల్లడించారు.



రోడ్లపై వదిలేసిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది